# ఇంట్లో పార్టీ

గౌరిలో అలా కబురుచేయగానే, ఇలా బిలబిలమంటూ వచ్చిపడ్డారు సూర్యం, సత్యం, సుబ్రహ్మణ్యంలు. సీలువేసిన స్కాచ్ బాటిల్ లాంటి గంభీరమైన చిరునవ్వుతో అందర్నీ ఆహ్వానించి హాల్లో దర్జాగా కూర్చోబెట్టాడు సుందర్రావు.

'ఏమిటి విశేషం?' అన్నాయి ఆరు కళ్లూ రెప్పవాల్చకుండా, పెదవులు విప్పకుండా.

టీపాయి కిందనుంచి మెక్డోవల్ విస్కీ ఫుల్‌బాటిల్ తీసి టీపాయిమీద పెట్టి, వాళ్ల మొహాలకేసి చిరునవ్వు వెడల్పుచేసి చూశాడు సుందర్రావు.

ముగ్గురు మొహాలూ ముందుకు మూరెడు సాగాయి. నాలుకలపై నీళ్లు ఫౌంటెన్‌లా చిమ్మాయి. సీసా మూత విప్పకముందే మనస్సుల్లో ఉత్సాహం వెచ్చగా ఆవిరి కొట్టింది.

"మా ఆవిడ పుట్టింటికెళ్లింది- గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో." అన్నాడు సుందర్రావు సీసా సీలును చిటుక్కుమనిపిస్తూ.

"ఎంత శుభవార్త!" అన్నాడు సూర్యం నాలుకతో పెదవుల్ని తడిచేస్తూ.

"ఎక్సలెంట్" అన్నాడు సుబ్రహ్మణ్యం గొంతు సాపుచేసుకుంటూ.

"మీ ఆవిడ సాధారణంగా ఇల్లు కదిలే ఘటం కాదే!" అన్నాడు సత్యం సిగిరెట్టు వెలిగించి

"వాళ్ల నాన్నకు జబ్బుగా వుందట. ఆ సంగతి తెలిసి, చూసి రమ్మని నేనే సలహా యిచ్చాను" అన్నాడు సుందర్రావు గ్లాసులు నింపుతూ.

'ఛీర్స్'తో గ్లాసులు రంగురంగున మోగాయి.

జోక్స్‌తో, నవ్వులతో, కేకలతో ఇల్లంతా సంతరావూరు సంతలా వుంది.

ఒక రౌండు ముగిసింది. రెండో రౌండు మొదలైంది

టీపాయ్ మీద విస్కీగ్లాసులు విచ్చలవిడిగా డ్యాన్సు చేస్తున్నాయి.

---

తాళ్లూరు నాగేశ్వరరావు

—అంతలో వీధి తలుపుమీద అరచేతులు వాలిన శబ్దమైంది.

"ఇప్పు డెవడ్రా తలుపులు కొడతాడు ?" అంటూ ఎక్కడలేని విసుగుతో విస్కీ గ్లాసును అలానే కుడిచేత్తో పట్టుకొని తలుపు తెరిచాడు సుందర్రావు.

ఎదురుగ్గా చేతిలో సూట్ కేసుతో భార్యామణి ప్రత్యక్షం.

సుందర్రావు కుడిచేతిలోని విస్కీగ్లాసు జారి కిందబడింది. హాల్లో వి స్నేహితులు బిత్తరపోయి, తత్తరపాటుతో చెప్పుల్లో కాళ్ళు కూడా పెట్టుకోకుండానే అడేపోతగా పోయారు- గ్లాసుల్లో ద్రావణాన్ని అ పళంగానే వొదిలేసి

"నన్ను పుట్టింటికి పంపించి, మీరు చేసే పని ఇదా ? మీ ఎత్తు చిత్తు చేయడానికే నాటకం ఆడాను. ఆఁ !" అంటూ భద్రకాళిలా ఇంట్లో ప్రవేశించింది సుందర్రావు భార్య సుభద్రాకుమారి.

*భార్య పుట్టింటి కెళ్లిందనే భ్రమతో వెంటనే ఇంటిలో డ్రింక్ పార్టీ పెట్టరాదు.*

---

**డిసెంబరునెల యువ భావ పరిచయ పోటీ**

**రు. 25-00 బహుమతి పొందిన వ్యాఖ్య**

1) అనుకున్నది ముట్టిన
అల్ప సంతోషి
రేపు దృష్టిలేక
మేను వాల్చె

—డి. శ్యామల, విశాఖపట్నం

2) ప్లేసు లీజుకిచ్చి
క్లాసుగా పరుండె

—డి. ఎల్. ఎన్. శాస్త్రి, విశాఖపట్నం

బహుమతి సమంగా పంచబడినది